www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 23 సెప్టెంబరు 2025

5

పశ్చిమ గోదావరి

వర్మీ కంపోస్టు వినియోగించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రొయ్యల చెరువుల్లో వర్మీ కంపోస్ట్‌ను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ స్టాల్‌ను కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించి వర్మీ కంపోస్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం కిలో ఒక్కింటికి రూ.10 చొప్పున చెల్లించి కొనుగోలు చేసిన రైతులకు 4.5 టన్నుల వర్మీ కంపోస్ట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ సచివాలయాల ద్వారా కిలోకు రూ.పది చొప్పున చెల్లించి వర్మీ కంపోస్ట్‌ను పొందవచ్చున్నారు. రొయ్యల చెరువుల్లో వర్మీ కంపోస్ట్ వాడటం వల్ల నీటి నాణ్యత మెరుగుపడుతుందన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిపిఒ రామ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులా.. ప్రజాకంటకులా..!

నేవీ ఆయుధ డిపో బలవంతంగా ఏర్పాటు చేసేందుకు కుట్రలు

ఎంపీ, ఎంఎల్ఎ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకించినా నిరంకుశ ధోరణితో ముందుకు

ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తలపెట్టిన ర్యాలీపై ఉక్కుపాదం

30 యాక్ట్ అమల్లోకి తెచ్చి అడ్డుకునేందుకు యత్నం

గిరిజన, ప్రజా సంఘాల నాయకుల ముందస్తు నిర్బంధం కోసం వేట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజలకు అండగా ఉంటామంటూ ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత అభివృద్ధి పేరుతో ప్రజాప్రతినిధులే.. ప్రజాకంఠకులుగా మారుతూ ప్రజలను హింసిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి మండలంలో నేవీ ఆయుధ డిపో నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిరంకుశంగా ముందుకెళ్తున్న ధోరణే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. తమ ప్రాంతంలో నేవీ ఆయుధ డిపో వద్దంటూ మూడుసార్లు గ్రామసభ వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ముందుకు సాగుతున్న తీరుపై గిరిజనుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల తీరును నిరసిస్తూ మంగళవారం ఆయుధ డిపో నిర్మించే గ్రామాల ప్రజలంతా మడకంవారిగూడెం నుంచి శాంతియుతంగా ర్యాలీ చేపట్టి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఆయుధ డిపోకు వ్యతిరేకంగా తలపెట్టిన ర్యాలీని భగ్నం చేసేందుకు ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దింపిన పరిస్థితి ఉంది. పోలవరం నియోజకవర్గంలోని మూడు మండలాలు జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో 30 యాక్ట్ అమల్లోకి తెచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. తమ ప్రాంత భూములపై గిరిజనులకు హక్కు లేదన్నట్లు.. తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం అడవి బిడ్డలకు లేదన్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని 2023లో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు జరిగాయి. ఈ గ్రామాల పరిధిలో మొత్తం 1,166 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించారు. అప్పట్లో రెండుసార్లు నిర్వహించిన గ్రామసభల్లో అక్కడి ప్రజలు నేవీ ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 అక్టోబర్ 28న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలోనూ ప్రజలు ఆయుధ డిపోను వ్యతిరేకిస్తూ మరోసారి తీర్మానం చేశారు. మూడుసార్లు ప్రజలు వ్యతిరేకంగా తీర్మానం చేసిన తర్వాత కూడా అక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూడటం వెనుక పెద్దఎత్తున కుట్ర ఉన్నట్లు చర్చ నడుస్తోంది. ఇదంతా ఎంపీ, ఎంఎల్ఎ కావాలనే చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుతో ఎటువంటి ఉద్యోగ అవకాశాలూ రావు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగాను ఉపాధి లభిస్తుందని చెప్పి గిరిజనులను నట్టేట ముంచేశారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. తరలించిన ప్రజలు ఉపాధి లేక అల్లాడిపోతున్నారు.



పోలీసు నోటీస్

జీలుగుమిల్లి సర్కిల్ ప్రజలకు పోలీసు విజ్ఞప్తి.ప్రజల శాంతి-భద్రతలకు అంతరాయం కలిగించే లేదా ప్రజా శాంతి భంగం కలిగించే ఏవైనా సమావేశాలు, ర్యాలీలు, గుంపులుగా కూడికలు వంటి కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి.జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలోని జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, టి.నరసాపురం మండలాలలో శాంతి భద్రతను కాపాడడానికి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది.అందువల్ల అనుమతి లేకుండా ఏవైనా కార్యక్రమాలు నిర్వహించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి.

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం—

- గుంపులుగా కూడడం
- ప్రజా శాంతికి భంగం కలిగించడం
- ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడంవంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

కాబట్టి జీలుగుమిల్లి సర్కిల్ ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించవలసిందిగా కోరడమైనది.

21/09/2025

సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్
జీలుగుమిల్లి సర్కిల్
Circle Inspector of Police
Jeelugumilli Circle

30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు పోలీసులు జారీ చేసిన ఉత్తర్వులు

ఆయుధ డిపో ఏర్పాటు వెనుక ప్రజాప్రతినిధులు ఎందుకు ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజనుల భూములు లాక్కుని ఉపాధి లేకుండా చేయాలని చూస్తున్నారు. రక్షణశాఖకు సంబంధించిన ఆయుధ డిపో ఏర్పాటైతే వచ్చే ఆంక్షల గురించి అందరికీ తెలిసిందే. మైదాన ప్రాంతాల్లో భూములు ఉన్నప్పటికీ గిరిజనులపై కక్షగట్టినట్లు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది.

తీవ్రరూపం దాల్చనున్న ఆయుధ డిపో వ్యతిరేక పోరాటం

ఆయుధ డిపోకు వ్యతిరేకంగా చేపడుతున్న ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు చూస్తున్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో తుందుర్రు ఆక్వా ఫుడ్‌పార్క్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ఇదేవిధంగా అణచివేయాలని అప్పట్లో తీవ్ర నిర్బంధం సాగింది. దీంతో తుందుర్రు పోరాటం జిల్లాను, రాష్ట్రాన్ని సైతం కుదిపేసింది. ఆ దెబ్బకు 2019 ఎన్నికల్లో జిల్లాలో టిడిపి రెండు సీట్లకే పరిమితమైంది. నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం సైతం రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారే పరిస్థితి కనిపిస్తోందనే చర్చ సాగుతోంది. గిరిజన ప్రజాప్రతినిధులు గిరిజనులకు అండగా ఉంటారో.. వ్యతిరేకంగా పని చేస్తారో వేచిచూడాలి.

వంతెనలు నిర్మించారు.. అప్రోచ్ రోడ్లు మరిచారు

12 ఏళ్ల నుంచి ఏం చేస్తున్నారు : సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

వంతెనలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

యనమదుర్రు డ్రెయిన్‌పై ఎన్నో ఏళ్ల క్రితం వంతెనలు నిర్మించారు అయితే అప్రోచ్ రోడ్లు మాత్రం నిర్మించకపోవడంతో శివారు ప్రాంత ప్రజలు కష్టాలు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. 16 ఏళ్ల క్రితం వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించారని, తర్వాత మూడేళ్లకు ఆ పనులు పూర్తయినా, 12 ఏళ్లుగా అప్రోచ్ రోడ్లు నిర్మించలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందని ప్రశ్నించారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలను సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ప్రజా సమస్యలను, వినతులను దృష్టిలో పెట్టుకుని యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సుమారు 16, 18 ఏళ్ల క్రితం పనులు ప్రారంభించి పూర్తి చేయడానికి సుమారు మూడేళ్లు పట్టిందన్నారు. భీమవరం నుంచి తోకతిప్ప వరకూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఉపయోగించి మూడు వంతెనల నిర్మాణం పూర్తిచేసి దాదాపు 12 ఏళ్లు అయ్యిందన్నారు. వంతెనలు నిర్మించినప్పటికీ ప్రజల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఈ వంతెనపై తక్షణం అప్రోచ్ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. జాప్యం చేస్తే పెద్దఎత్తున ప్రజానీకాన్ని కదిలించి ఆందోళన నిర్వహిస్తామన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ పాలకులు మారుతున్నారు తప్ప ఈ వంతెనలకు అప్రోచ్ రోడ్లు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడి మాదిరిగానే ఉండిపోతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకులు ఎం.వైకుంఠరావు, నేతలు రేవు రామకృష్ణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, మల్లిపూడి ఆంజనేయులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద ధర్నా

భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 22 పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రెగ్యులర్ ఉద్యోగుల పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, డిఎ చెల్లించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్కాంఎం ప్రెసెంట్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును విద్యుత్ సంస్థలో అమలు చేయకపోవడాన్ని విమర్శించారు. సీనియార్టీతో సంబంధం లేకుండా అందరికీ రూ.46 వేల వేతనం చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో కాంట్రాక్టు కార్మికులకు కూడా హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలు రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సిఐటియు నాయకత్వంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు, యూనియన్లు స్ట్రగుల్ కమిటీ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ ఆందోళన చేస్తున్నామని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా విద్యుత్ ఉద్యోగులను మోసం చేసి వేతన సవరణ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకూ పిఆర్‌సి కమిటీ వేయకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వాలు తప్పించుకుంటున్నాయన్నారు. కార్మికులచే విపరీతమైన పని భారం, ఒత్తిడి పెంచి పని చేయించుకోవడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో కష్టపడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు పాండు రంగరాజు, దత్తాత్రేయ, శ్రీనివాసరాజు పజులురుద్దీన్, కాంట్రాక్టు కార్మిక నాయకులు జెర్సీ, శేఖర్, ప్రశాంతి, రాజ్ కుమార్, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, వైకుంఠరావు, కార్మికులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు దారుణం

తక్షణం బిల్లు ఉపసంహరించుకోవాలి - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

భీమవరం : ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని, పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. పని గంటల పెంపు బిల్లును సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. భీమవరంలో సిఐటియు ఆధ్వర్యంలో పనిగంటల పెంపు బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారన్నారు. దీని స్థానంలో 10 గంటల నుంచి 13 గంటల వరకు పనిచేయించుకోవచ్చని నిబంధనలను సడలించడం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడమేనని విమర్శించారు. రాత్రి సమయాల్లో మహిళలతో పని చేయించుకోవచ్చని కార్మిక చట్టాల సవరణ చేయడం దారుణమన్నారు. పట్టపగలే మహిళలకు రక్షణ లేదని రాత్రి సమయంలో పనులకెళ్లే మహిళలకు ఎలాంటి రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. ఇప్పటికే యంత్రాలు పెరిగి కార్మికులకు పని భారం పెరిగిందని, పని గంటలు పెంచడం ద్వారా కుటుంబాలకు మరింత దూరం పెంచడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడుతుందని తెలిపారు. ఏ రాష్ట్రం అమలు చేయని రీతిలో కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. కార్మికవర్గం 8 గంటల పని నిలుపుకోవడం కోసం పెద్దఎత్తున పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు దండుకుని కార్మికుల పొట్టలు కొట్టే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికే కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలు జరగక పెరుగుతున్న ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు 8 గంటల పని అమలయ్యే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో నేతలు కె.వెంకటేశ్వరరావు, శ్రీను, ఎం.వైకుంఠరావు, బి.వరలక్ష్మి, పిన్నింటి శ్రీను పాల్గొన్నారు.

ఆచంట: పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిన బిల్లును తక్షణమే విరమించుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు అన్నారు. సోమవారం స్థానిక కచేరీ సెంటర్లో 13 గంటల పని దినాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు మండల కోకన్వీనర్ నేలపాటి విజయలక్ష్మి, నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, కుసుమ జయరాజు, పి.మోహన్‌రావు, రొక్కాల దేవాదానం, దేవాబత్తుల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తణుకులో..

తాడేపల్లిగూడెంలో..

తణుకు: కూటమి ప్రభుత్వం 8 నుండి 13 గంటలకు పెంచిన పని గంటల బిల్లు తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నరేంద్ర సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో పని గంటల పెంపు బిల్లును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి.ప్రతాప్, సిఐటియు మండల కన్వీనర్ గుబ్బల గోపి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు పెంచకపోగా, పని గంటలు పెంచడాన్ని విమర్శించారు. చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం కార్మికుడు 10 గంటలు మాత్రమే చేయాలని చెబుతూ, మరోపక్క ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అనుమతితో 13 గంటల వరకు చేయించుకోవచ్చని ప్రభుత్వం చెప్పడం బాధాకరమన్నారు. పని గంటల పెంపు బిల్లు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే జరిగే ఉద్యమాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గారా రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, ఎన్.ఆదినారాయణబాబు, అంబటి రామకృష్ణ, ఎం.రమేష్, రామకృష్ణ, వివి.రాజు, కృష్ణబాబు, రాంబాబు, కె.అయ్యప్ప, సుధీర్‌బాబు, లలిత్‌కుమార్, అనంతలక్ష్మి, కుసుమ, కొమరరాణి, దుర్గారావు, సాయి, రమణ, గోవిందరాజు, కేశవ, గంగాధర్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పని గంటల పెంపు బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టిడిపి కూటమి ప్రభుత్వం 8 గంటల పని వేళలను 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను నూటికి నూరు శాతం సమర్థిస్తూ రాష్ట్రంలోని కార్మిక వర్గానికి తీవ్ర ద్రోహం చేస్తోందని ఆయన విమర్శించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 6 గంటలకు తగ్గించాలని రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల పోరాటాలు చేస్తుంటే, దీనికి భిన్నంగా 13 గంటలకు పెంచడం ఎవరి ప్రయోజనాల కోసమో చంద్రబాబు ప్రభుత్వం తెలియజేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు, ఆందోళనలు చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అయినాల సత్యనారాయణ, రాజాన గోవింద్, రావి శ్రీనివాసరావు, పప్పుల ప్రభాకరరావు, నరమాల కృష్ణ, పులిమంతుల రమణ, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: పని గంటల పెంపు బిల్లును నిరసిస్తూ వెంటప బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సానబోయిన కృష్ణారావు, చిలకపాటి పౌలు, చిలకపాటి చిట్టిమేరి, సత్యనారాయణ, వేగి మోహన్‌రావు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ నాగరాణి

24న సిఎం చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 24న పాలకొల్లులో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకకు సిఎం చంద్రబాబు హాజరయ్యేందుకు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో సిద్ధం చేస్తున్న హెలీప్యాడ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం పరిశీలించారు. అనంతరం రామచంద్ర గార్డెన్స్ వెనుక లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న కళ్యాణ వేదిక ప్రాంతాన్ని, మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. హెలీప్యాడ్ నిర్మాణం పకడ్బందీగా చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. బారికేడ్‌లు, ఐరన్ మెస్ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి శ్రీవేద, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డిపిఒ ఎం.రామ్ నాథ్‌రెడ్డి, తహశీల్దార్ వై.దుర్గా కిషోర్ ఉన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ నాగరాణితోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 194 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 2వ తేదీ నుండి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ దేవాలయాల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని ఆదేశించారు. అనంతరం స్వమిత్వ, ఇపిటిఎస్ డాక్యుమెంట్స్ అప్లోడింగ్ ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. స్వమిత్వ సర్వేను వేగవంతం చేసి ఈ నెల 27వ తేదీ నాటికి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేత

స్త్రీ నిధి రుణాలు పారదర్శక చెల్లింపులకు బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామ సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని డ్వాక్రా సంఘాలకు ప్రతియేటా సుమారు రూ.220 కోట్ల స్త్రీ నిధి రుణాలుగా అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని గ్రామ సంఘాలకు 850 బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, గ్రామ సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమవరం పాత బస్టాండ్ పునఃప్రారంభం

రూ.55 లక్షలు నిధులిచ్చిన దాతలను అభినందించిన కలెక్టర్ నాగరాణి, ప్రజాప్రతినిధులు

బస్టాండ్ ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

చేకూరి రామబద్రిరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో రూ.55 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన భీమవరం పాత బస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రారంభించారు. కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన వెంకట సత్యనారాయణరాజు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పాల్గొన్నారు. నాలుగు ప్లాట్‌ఫారాలను, శిశువులకు పాలిచ్చే గది, రిజర్వేషన్ అండ్ కార్గో కౌంటర్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భవ్య భీమవరంలో భాగంగా చేకూరి రామబద్రిరాజు, పార్వతి దంపతుల ఆర్థిక సహకారంతో భీమవరం పాత బస్టాండ్‌ను ఆధునికీకరించుకోవడం సంతోషకరమన్నారు. ఏళ్ల తరబడి కనీస మౌలిక వసతులు లేకుండా మహిళలు, పిల్లలు, దూర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వారికి సౌకర్యవంతమైన కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకొచ్చి పూర్తిచేసిన రామబద్రిరాజు అందరి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. రామబద్రిరాజు కుటుంబాన్ని ప్రోత్సహించిన లయన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్.కృష్ణంరాజును ప్రత్యేకంగా అభినందించారు. దీనిలో పాలుపంచుకున్న భీమవరం మున్సిపల్ ప్రత్యేక అధికారి కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డిలను అభినందించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, భీమవరం ఆర్‌టిసి డిఎం ఎన్‌విఆర్.వరప్రసాద్, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణరాజు, తహశీల్దార్ రావి రాంబాబు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, లయన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్.కృష్ణంరాజు, స్వచ్ఛంద సేవకులు కంతేటి రామరాజు, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

గోనె సంచులు పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

రైస్ మిల్లుల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణంలోని సత్య సాయి దుర్గ (టండర్స్) రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లులో గోనె సంచులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంచుల నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిరిగి ఉన్న సంచులను వెంటనే కుట్టించాలని మిల్లరును ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు నాణ్యమైన గోనె సంచులు మాత్రమే అందించాలని సూచించారు. సివిల్ సప్లరు జిల్లా మేనేజరు ఎండి ఇబ్రహీం, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవి శంకర్, సిబ్బంది ఉన్నారు.

ఆక్వాజోన్ నిర్ధారణపై సిఫార్సు చేయాలి

ఆక్వాజోన్ల నిర్ధారణలో నిబంధనల మేరకు పారదర్శకతతో కూడిన ప్రతిపాదనలను సిఫార్సు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మత్స్య శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, ఉండి, ఆకివీడు, కాళ్ల, భీమవరం, పెంటపాడు, గణపవరం మండలాల ఎఫ్‌డిఒలు, ఎంఎఒలతో సమీక్షించారు. ఈ నెల 19న నిర్వహించిన జిల్లా స్థాయి ఆక్వా జోనైజేషన్ ప్రకటన కమిటీలో ఆమోదించిన 31,307.4 ఎకరాల విస్తీర్ణంతో కలిపి ప్రస్తుతం జిల్లాలో 1,32,562.9 ఎకరాల ఆక్వా సాగు విస్తీర్ణం ఉందని తెలిపారు. ఆక్వా జోనైజేషన్ సర్వేలో వివిధ కారణాలతో తిరస్కరించిన 9,855.31 ఎకరాల విస్తీర్ణంపై పున్ణపరిశీలన చేయడం జరిగింది. మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆర్‌విఎస్.ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉండి, ఆకివీడు, కాళ్ల, భీమవరం, పెంటపాడు, గణపవరం మండలాల ఎఫ్‌డిఒలు, ఎంఎఒలు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖ అధికారి డివైఇఒ రామాంజనేయులుకు సోమవారం ఎఐఎస్ఎ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ దసరా సెలవుల సందర్భంగా ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు సెలవులు ఇవ్వాలని, అలాగే సెలవులు ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం జిఒ విడుదల చేసిందని, అయితే తాడేపల్లిగూడెంలో పలు ప్రయివేటు విద్యాసంస్థలు యధావిధిగా స్కూల్స్ నడుపుతున్నారని వారు విమర్శించారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.సాయి, పి.రాజేష్, కె.అభిషేక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఓంకార్‌నాథ్

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్‌నాద్ తెలిపారు. సోమవారం ఎ.గోపవరంలో జరిగిన స్వస్తి సశక్ నారీ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. శిబిరంలో మహిళలకు కేన్సర్ స్కేనింగ్ ప్రసూతి సంరక్షణ, వ్యాధి నిరోదక టీకాలపై పలు సూచనలు చేశారు. క్షయ, అధిక రక్తపోటు, నోటి కేన్సర్, మధుమేహంపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 221 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాఠంశెట్టి పద్మావతి, శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సత్కరిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

కొలువులు సాధించిన వారికి సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

మీరా స్మారక గ్రంథాలయంలో చదువుకుని మెగా డిఎస్‌సిలో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు గ్రంథాలయ కమిటీ సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, కార్యదర్శి కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మీరా గ్రంథాలయాన్ని మూడేళ్ల క్రితం సెమినార్ రీడింగ్ హాల్ నిర్మించి నిరుద్యోగ యువత, విద్యార్థులు చదువుకునేందుకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించి ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కల్పించామన్నారు. డైలీ న్యూస్ పేపర్స్ వివిధ రకాల సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మెగా డిఎస్‌సిలో పి.సురేష్ (టిజిటి తెలుగు), డి.కిరణ్‌కుమార్ (ఎస్ఎ ఇంగ్లీష్), డిఎన్.బాబు, ఎస్ఎ (పిఇటి)లు మీరా గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగాలు పొందడం అభినందనీమన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు గ్రంథాలయ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, పొగాకు నారాయణరావు, నోములకొండ బూడిద జోగేశ్వరరావు, జి.ఆజాద్, కవురు నరసింహస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న వసతులను వినియోగించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సోమవారం స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన ఫ్రెషర్స్ డే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆమె అధ్యక్షత వహించారు. అనంతరం కాలేజీలో అన్ని సబ్జక్టుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఎఎస్ఐ ఆర్.వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పోలీస్ వ్యవస్థ పరంగా రక్షణకు సంబంధించిన చట్టాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కెవి.గణేష్‌కుమార్, జి.వెంకట్రావు, జివి.శారదాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేదలపై పెత్తందారుల కుట్ర..!

పంట బోదెకు అడ్డుకట్టలు
జువ్వలపాలెంలో కంపు కొడుతున్న డ్రెయినేజీలు
పట్టించుకోని అధికారులు.. ప్రజాప్రతినిధులు

ఇళ్లల్లోకి ప్రవేశించిన వర్షపు నీరు

పూడుకుపోయిన పంట బోదె

ప్రజాశక్తి - కాళ్ల

ఒక వైపు పేదలపై పెత్తందారుల కక్షతో పంట బోదెకు అడ్డుకట్టలు వేయడం.. మరో వైపు అధికారులు.. ప్రజా ప్రతినిధులు డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలపై పట్టించుకోకపోవడం జరుగుతోంది. అసలే వర్షాకాలం కావడంతో పారిశుధ్యం పడక విస్తుతోంది. దోమలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం పడకేయడంతో రోజురోజుకూ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాలు, ఒళ్లు నొప్పులు తదితర వాటితో ఇబ్బంది పడుతున్నారు.

జువ్వలపాలెం గ్రామంలోని సంతోషపురం, సగ్గపేట ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ పరిస్థితి అధ్వానంగా తయారైంది. డ్రెయినేజీలు పూడుకుపోవడం, కొన్ని చోట్ల అసలు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇంత జరుగుతున్న డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పూడికతీసి, శుభ్రం చేయని పరిస్థితి. దీంతో ఎక్కడ చూసినా మురుగు నీరు నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలు పెరిగి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని వెంటనే ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఒకప్పుడు పంట బోదె ఉన్నప్పుడు వరి సాగు చేసేవారు. ప్రస్తుతం ఆక్వా సాగు రాకతో పంట బోదె మురికి కాలువగా మారింది. ఇటీవల సంతోషపురం, సగ్గపేట ప్రాంతాలకు ఆనుకుని ఆక్వా చెరువులు తవ్వాలని పెత్తందారులు ప్రయత్నించారు. పేదలు, సిపిఎం నాయకులు ప్రతిఘటించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో తవ్వకాలు నిలుపుదల చేశారు. చెరువు తవ్వకాలు చేయకుండా అడ్డుకున్న పేదలపై పెత్తందారులు కక్ష పెంచుకుని పంట బోదెలో మూడు ప్రాంతాల్లో అడ్డుకట్టలు వేశారు. పంట బోదెను శుభ్రం చేయకపోవడంతో ఇళ్లల్లోకి మురుగు చేరుతోంది. రోజుల తరబడి డ్రెయినేజీలో మురుగు నీరు నిల్వ ఉండడంతో అధికవర్షం కురిసినప్పుడు సంతోషపురంలో ఇళ్లలోకి చేరుతున్న పరిస్థితి.దీంతో అక్కడ ఉండలేక ఇల్లు ఖాళీ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

గత శనివారం కురిసిన వర్షానికి సుమారు 10 ఇళ్లల్లోకి నీరు ప్రవేశించింది. రెండు కుటుంబాలు ఆదివారం ఇల్లు ఖాళీ చేసి వేరే ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు. పారిశుధ్యం, డ్రెయినేజీ సమస్య ప్రధానంగా ఉంది. వర్ష కాలం కావడంతో మురుగు నీరు, చెత్తా చెదారం నిల్వతో దోమలు వ్యాపించి విష జ్వరాల పాలవుతున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. క్లోరినేషన్ లేక దోమలతో రోగాల బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతోషపురం, సగ్గపేట ప్రాంతాలకు పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని ఉన్నత అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊర చెరువులోకి మురుగు నీరు..

సంతోషపురం, సగ్గపేట ప్రాంతాలు 7, 8వ వార్డుల్లో డ్రెయినేజీ, పారిశుధ్య సమస్య ప్రధానంగా ఉంది. ఆ ప్రాంతానికి చేర్చి పంచాయతీ ఊర చెరువు ఉంది. ఒకప్పుడు ఊర చెరువునీటిని తాగునీటికి ఉపయోగించేవారు. ప్రస్తుతం అది నిరుపయోగంగా మారింది. ఇళ్లల్లోని మురుగు నీరు ఊర చెరువులోకి వెళ్లే ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ ప్రాంతం దుర్గంధంగా మారింది. ఇటీవల సంతోషపురానికి చేర్చి దేవస్థానం భూమి ఉంది. ఆక్వా చెరువులుగా మార్పు చేసేందుకు రైతులు ప్రయత్నం చేశారు. సంతోషపురంలో నివాసాలకు ఆనుకుని ఆక్వా చెరువు తవ్వకాలను ఆపాలని స్థానికులు, సిపిఎం నేతలు ఆందోళన చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్వా చెరువు తవ్వకాలు నిలుపుదల చేశారు.

బోదెలో మూడు ప్రాంతాల్లో అడ్డుకట్టలు..

సంతోషపురం, సగ్గపేట ప్రాంతాల్లోని పంట బోదెలో మూడు ప్రాంతాల్లో అడ్డుకట్ట వేశారు. దీంతో మురుగు, వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామంలో ఇళ్ల ముందు మురుగునీరు అధికంగా పారుతోందని, ఇలా అయితే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయి.

బోదె పనులు చేయాలి..

బోధనపు మహంకాళ్ళమ్మ, జువ్వలపాలెం

పంట బోదెలో ప్రక్షాళన పనులు చేయకపోవడంతో నీరు వెళ్లడం లేదు. గ్రామంలో పెత్తందారులు బోదెలో మట్టి అడ్డు కట్టలు వేశారు. వరిసాగు ఉన్నప్పుడు నీరు సక్రమంగా వెళ్లేది. ఆక్వా చెరువులు వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు చేయడం లేదు. దీంతో బోదె పూడుకుపోయింది. వర్షం వచ్చినప్పుడు ఇళ్లల్లోకి నీరు వస్తోంది. నివసించడం కష్టంగా మారింది.

కక్షపూరితంగా అడ్డుకట్ట వేశారు..

గండికోట వెంకటేశ్వరరావు, జువ్వలపాలెం

జువ్వలపాలెం క్రిస్టియన్‌పేట నుంచి ప్రారంభమైన పంట బోదె సంతోషపురం, సగ్గపేట నుంచి ఉప్పుటేరులోకి వెళ్లేది. ఈ బోదెలో పలు చోట్ల పెత్తందారులు పొలాలు ఉండడంతో కక్షపూరితంగా మూడు చోట్ల అడ్డుకట్ట వేశారు. ఇటీవల కురిసిన వర్షానికి మురుగు వర్షపు నీరు రోడ్లపైకి చేరిపోయింది. దోమల ఉధృతి పెరిగింది. డెంగీ, విష జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి..

గొర్ల రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి

జువ్వలపాలెం గ్రామంలో సంత మార్కెట్ నుండి సంతోషపురం, సగ్గపేట వరకూ ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను పూడ్చేయడంతో మురుగు వర్షపు నీరు వెళ్లడం లేదు.ఆ నీరు రోడ్లపై పారుతోంది. ఇళ్లలోని మురుగు నీరు ఊర చెరువులోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఈ చెరువులోకి మురుగు, వర్షపు నీరు నిండిపోయి దోమలతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. పెత్తందారులు కావాలనే పేదలను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ప్రజలపై కక్షపూరితంగా దిగుతున్నారు. గ్రామ కార్యదర్శి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పై తగు చర్యలు తీసుకోవాలి. వెంటనే బోదెలో ఉన్న అడ్డు కట్టలు తొలగించి మురుగునీటిని తొలగించకపోతే విజయవాడ తరహా అతిసార ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టాలి.

వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - అత్తిలి (తణుకు)

కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అత్తిలి మండల రెండో మహాసభ వనం రాంబాబు అధ్యక్షతన అత్తిలి సుందరయ్య భవనంలో జరిగింది. ఈ మహాసభ ప్రారంభానికి ముందు సంఘం పతాకాన్ని దాయం వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సత్యనారాయణ, వీరభద్రరావు మాట్లాడుతూ శ్రమజీవులైనా వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీపై ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు నిర్వహిస్తున్న శాఖా పరమైన చర్చల్లో నేటికీ ప్రస్తావించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో రూ.కోటీ 50 లక్షల వరకూ వ్యవసాయ కూలీలు ఉన్నారని, ప్రభుత్వ లెక్కల ప్రకారం వ్యవసాయ కూలీల్లో 90 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలే అని, వారిలో అధిక సంఖ్యలో మహిళలు ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో వ్యవసాయ పనులు తగ్గుతున్నాయన్నారు. దీంతో కూలీలు ఉన్న ఊరిని వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉపాధి హామీకి బడ్జెట్లో రెండు లక్షల నలభై వేల కోట్ల రూపాయలు కేటాయించి, ప్రతి కుటుంబానికీ 200 రోజులు పని కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా సానబోయిన సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అగులూరి వెంకటలక్ష్మి, కార్యదర్శిగా వనం రాంబాబు, అడ్డగర్ల వెంకట రాధాకృష్ణ, కమిటీ సభ్యులుగా బొక్క దుర్గాభవాని, జి.సంతోష్‌కుమార్, గంజి లావణ్య. దేవర దుర్గాప్రసాద్, సరేళ్ల కనకరాజు, కడలి రామకృష్ణ. తానికొండ సుష్మ, మల్లెపూడి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

వినతులు గడువులోగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం కార్యాలయ ఎఒ పెద్దిరాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 41 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఎఒ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం :ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్

వికలాంగులకు ఇంటికే రేషన్ బియ్యం పంపిణీ చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆచంట నియోజకవర్గ వికలాంగులు కోరారు. సోమవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వికలాంగుల ఇంటికే రేషన్ బియ్యం ఇంటికే పంపిణీ చేయాలని చెప్పినా అందరికీ పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. రేషన్ డీలర్లను అడిగితే మాకు మీ పేర్లు రాలేదని చెబుతున్నారని తెలిపారు. మాలో కొందరికి 35 కిలోల బియ్యం వస్తున్నాయని, ఆడవారు మోయలేని పరిస్థితి ఉందని తెలిపారు. వికలాంగులందరికీ రేషన్ బియ్యం ఇంటికే పంపిణీ చేసేలా చూడాలని ఎఒ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు.

మొగల్తూరు: మొగల్తూరు రవీంద్ర సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక వినతి అందిందని తహశీల్దార్ కె.రాజా కిషోర్ తెలిపారు. రావులపాలేనికి చెందిన ఒకరు తన పొలానికి వెళ్లే దారికి సర్వే నిర్వహించి దారి చూపాలని కోరుతూ వినతి అందించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సోమవారం తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో 03, పబ్లిక్ హెల్త్ విభాగంలో 01 కలిపి మొత్తం 4 అర్జీలు స్వీకరించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వైవి ఎసిపి జి.సీతారాం, మేనేజర్ ఎం.రవి సుధాకర్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని వినతి

ప్రజాశక్తి - కాళ్ల

రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టులను అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని విఆర్‌ఎలు తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని విఆర్‌ఎలు తహశీల్దారర్ సుందర్ సింగ్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు బి.కన్నయ్యరాజు, సెక్రటరీ టి.విద్యా సాగర్, విఆర్‌ఎలు కె.రమణ, బి.డేవిడ్, బి.సౌజన్య, ఎన్.మాధవి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

ఎల్‌ఐసి ఏజెంట్ల పోరుతోనే పాలసీలపై జిఎస్‌టి రద్దు

తాడేపల్లిగూడెం: జీవిత బీమా సంస్థ ఏజెంట్ల నిరంతర పోరాటమే ఎల్‌ఐసి పాలసీలపై జిఎస్‌టి రద్దుకు కారణమని ఏజెంట్స్ యూనియన్ నాయకులు పి.గోవింద్ తెలిపారు. సోమవారం తాడేపల్లిగూడెం జీవిత బీమా సంస్థ కార్యాలయం వద్ద పాలసీపై జిఎస్‌టి రద్దును స్వాగతిస్తూ ఏజెంట్ల యూనియన్ స్వీట్స్ పంపిణీ చేశారు. జిఎస్‌టి రద్దు కోరుతూ బ్రాంచ్ లెవెల్ నుండి బొంబాయి సెంట్రల్ ఆఫీస్, ఢిల్లీలో పార్లమెంట్ ముందు ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని రాజమండ్రి డివిజన్ నాయకులు కె.వెంకటేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లి వెంకటనరేష్, జిఎస్ఎన్ మూర్తి, మేషక్ బాబు, టి.పాండు రంగారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజెంట్స్ యూనియన్ నేతలు

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఎపి రైతు సంఘం వీరవాసరం మండల 5వ మహా సభలో 10 మందితో వీరవాసరం మండల నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. రైతు సంఘం మండల అధ్యక్షులుగా బాలం విజయకుమార్, కార్యదర్శిగా తాళ్లూరి హరిహర లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బొర్రా అలమహారాజు, ఉపాధ్యక్షులుగా నేపాల సీతన్న, యాళ్లబండి నారాయణ మూర్తి, సహాయ కార్యదర్శులుగా పాలకోడేటి లక్ష్మణ్‌రావు, నక్కా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు రెడ్డి రామారావు, చింతా నారాయణమూర్తి, పాలా కోటేశ్వరరావు, గుండుబోయిన రాంబాబుతో ఎన్నికయ్యారు.

'జనసేన నేతలపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

కూటమి ప్రభుత్వంలోని జనసేన నాయకులపై టిడిపిలోని కొందరు నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు తగవని భట్లమగుటూరు జనసేన గ్రామ అధ్యక్షుడు బయ్యే బాలాజీ సోమవారం విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు కొడాలి నాని, పేర్ని నాని, రోజా ఇలా కొంతమంది ఎంఎల్‌ఎలు బూతులు, అనుచిత వ్యాఖ్యలు చేసి నామరూపాలు లేకుండా పోయారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో టిడిపి ఎంఎల్‌ఎలు బోండా ఉమా, బుచ్చయ్య చౌదరి, జనసేన అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు.

'కూటమిపై విమర్శలు తగవు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

అధికారంలో ఉన్నప్పుడు అరకొరగా పనులు చేసి, ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన వైసిపి నేడు కూటమి నేతలపై విమర్శలు చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని టిడిపి మండల అధ్యక్షుడు వెలగల బుల్లిరామిరెడ్డి, పొలమూరు గ్రామ అధ్యక్షుడు పెన్మెత్స వివేక రాఘవేంద్రరాజు తీవ్రంగా విమర్శించారు. సోమవారం పొలమూరులో సమావేశం నిర్వహించిన కూటమి నాయకులు పొలమూరు-బ్రాహ్మణ చెర్వు ఆర్అండ్‌బి రహదారి అధ్వాన పరిస్థితి గురించి వాస్తవాల గురించి వివరించారు. పొలమూరు శివారు ప్రాంతంలో ఆర్అండ్‌బి రహదారి సమస్యపై వైసిపి నాయకులు చేసిన ఆరోపణల పట్ల, వారి తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ రహదారి అభివృద్ధికి ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ప్రత్యేకంగా దృష్టి సారించారని క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ, జనసేన-బిజెపి గ్రామ అధ్యక్షుడు తోరం వెంకన్నబాబు, యామిజాల విశ్వనాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కార్యదర్శి మేడిశెట్టి నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు గుడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిసి వెల్ఫేర్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా అధికారిగా సూరిబాబు

ప్రజాశక్తి - భీమవరం

బిసి వెల్ఫేర్ జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా ఎవి.సూరిబాబు నియమితులయ్యారు. కాకినాడ జిల్లా పెద్దాపురం డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తూ భీమవరం డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిగా బదిలీపై వచ్చారు. అనంతరం వీరికి ఖాళీగా ఉన్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పోస్ట్‌లో ఇన్‌ఛార్జిగా బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదవడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అన్ని వసతి గృహాలనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెల్ఫేర్ అధికారి సూరిబాబు

ఓజీ గత రికార్డులు తిరగరాస్తుంది

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రం గత రికార్డులను తిరగరాస్తుందని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో పవన్‌కళ్యాణ్ భారీ కటౌట్‌ను ఎంఎల్‌ఎ రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క రాజకీయాల్లో ఎంతో బిజీగా ఉన్న తాను నమ్ముకున్న కళారంగాన్ని వదులుకోకుండా ప్రేక్షకులు, అభిమానులను మెప్పించే విధంగా చిత్రాలు చేయడం అభినందనీయమన్నారు. పవన్‌కళ్యాణ్ అభిమానులనే కాకుండా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి భారీ కలెక్షన్లు సాధించే విధంగా ఈ చిత్రం మరోసారి రికార్డు సాధించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పవన్‌కళ్యాణ్ అభిమానులతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నార

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కలిదిండి లక్ష్మీపతిరాజు S/o. సోమరాజు డోర్‌నెం.7-22, కాలువ గట్టు, రైస్‌మిల్ దగ్గర, దిరుసుమర్రు గ్రామం, భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, నేను ది. 12.09.2025వ తేదిన దస్తావేజున్ను జిరాక్స్ తీయు నిమిత్తం మా ఇంటి నుండి దిరుసుమర్రు గ్రామంలోని రామాలయం రోడ్ లో వున్న జిరాక్సు సెంటర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యంలో నాయొక్క ఒరిజినల్ దస్తావేజు నెం : 832/2021 పోయినది. నేను మరలా మార్గమధ్యంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా నా యొక్క ఒరిజినల్ దస్తావేజు దొరకలేదు.నా ఒరిజినల్ దస్తావేజు దొరికిన వారు పైన తెలిపిన అడ్రస్సులో అందచేయ ప్రార్ధన.

కలిదిండి లక్ష్మీపతిరాజు S/o. సోమరాజు